కాంగ్రెస్ పవర్‌లోకి వచ్చింది.. రాష్ట్రంలో పవర్ పోతోంది

పార్లమెంట్ ఎన్నికల తర్వాత అంధకారం కానుంది

- గత ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారు తప్ప రేవంత్ చేసిందేమీ లేదు
- ఎల్బీనగర్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, వేదికపై మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు

వనస్థలిపురం, ఫిబ్రవరి 4: పాలనపై అవగాహన లేని సీఎం రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే పనిగా పెట్టుకున్నారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హస్తినాపురంలో జరిగిన ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథి హరీష్‌రావు కంటే ముందు ఎమ్మెల్యే మాట్లాడారు. అమలు చేయ సాధ్యంకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు నిధులు లేవని చెప్పడం సిగ్గు చేటన్నారు. ప్రతీ బడ్జెట్‌లో పుస్తకాలు అందిస్తామని, నిధులు ఎలా వస్తాయి.. ఎలా ఖర్చు చేయాలని స్పష్టంగా ఉంటుందన్నారు. రాష్ట్ర ఆదాయం ఏమిటో తెలియకుండా ఎలా హామీలిస్తారన్నారు. సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేసి రాష్ట్రాన్ని హరితమయం చేశారన్నారు. దేశంలో ధాన్యం అధికంగా పండించే రెండో రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందన్నారు. విద్యుత్ కోతలు లేని రాష్ట్రాన్ని రూపొందించారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో కరెంటు కోతలు ఏర్పడుతున్నాయన్నారు. ఒకేసారి కాకుండా అప్పుడప్పుడు తీసివేస్తూ రోజూ రెండు గంటల పాటు విద్యుత్ కోతలు విధిస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికలు అయిపోయిన తర్వాత విద్యుత్ కోతలు అధికమవుతాయన్నారు. కాంగ్రెస్‌కు ఓటేసినందుకు ప్రజలు బాధపడుతున్నారన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో కార్యకర్తలంతా ఒక్కతాటిపై ఉండి, తనను గెలిపించారన్నారు. అదే విధంగా రేపు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ప్రజల్లోకి వెళ్లి ఓట్లు వేయించాలన్నారు. కాంగ్రెస్ మాయ హామీలు, మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, బీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, సీనియర్ నాయకులు కుంట్లూర్ వెంకటేశ్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, పద్మా నాయక్, లక్ష్మీప్రసన్న, సాగర్‌రెడ్డి, జిన్నారం విఠల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు అందోజు సత్యం చారి, ముడుపు రాజిరెడ్డి, కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, చిరంజీవి, మల్లారెడ్డి, ఉద్యమకారులు, మాధవరం నర్సింహారావు, సత్యనారాయణ రెడ్డి, రాంకోటి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, ఫిబ్రవరి 4: ఆస్మాన్ ఘడ్ సీబీడీ ఏడీఈ పరిధిలోని బీ బ్లాక్, లక్ష్మీనగర్ 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. బీ బ్లాక్ 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఎల్ఐసీ కాలనీ పరిధిలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు ఎల్ఐసీ కాలనీ, న్యూ సైదాబాద్ పీఎస్, గ్రీన్ ల్యాండ్ కాలనీ, ఫర్హా కాలనీ, ఎల్‌సీహెచ్ కాలనీ, వాటర్ ట్యాంక్, పూసల బస్తీ, 11కేవీ లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు లక్ష్మీనగర్, ఇంద్రప్రస్థ కాలనీ, టెలిఫోన్ ఎక్స్‌చేంజ్, సంఘం లక్ష్మీ బాయి కాలేజీ సమీప ప్రాంతాల్లో చెట్ల నరికివేత కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయ ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

పెండింగ్ పనులను పూర్తి చేయండి

బడంగ్‌పేట, ఫిబ్రవరి 4: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్‌లో ఉన్న పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయించాలని కార్పొరేటర్ సూర్ణ గంటి అర్జున్ తెలిపారు. చాలా పనులు అసంపూర్తిగా నిల్చిపోయాయన్నారు. కాలనీ వాసుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే పనులను పూర్తి చేయాలన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న కాలనీ వాసులు

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆర్కేపురం, ఫిబ్రవరి 4 : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వాసవి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, కమిటీ సభ్యుడు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వాసవి కాలనీలోని సీనియర్ సిటిజన్ భవనంలో ఓజోన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వారు హాజరై ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సంపూర్ణ ఆరోగ్యం సిద్ధించాలంటే ప్రతి రోజు నడకతోపాటు వ్యాయామం చేయాలన్నారు. ప్రస్తుత సమాజంలో చిన్నా పెద్ద అనే తేడాలేకుండా అనారోగ్యాల బారిన పడుతున్నారని, ఇందుకు కారణం జంక్‌ఫుడ్ అని పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించవచ్చన్నారు. ఈ వైద్య శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దామోదర్, రామకిషన్, లక్ష్మయ్య, అంజయ్య, సుభాకర్‌రావు, కృష్ణమూర్తి, శ్రీనివాస్, అరుణ, సురేశ్, వైద్య బృందం పాల్గొన్నారు.

రేపు మహేశ్వరం నియోజకవర్గం.. బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం

- హాజరుకానున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బడంగ్‌పేట/ఆర్కేపురం, ఫిబ్రవరి 4 : మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం ఈ నెల 6వ తేదీన ఉదయం 10 గంటలకు మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లేలగూడ (ఎస్‌వైఆర్ గార్డెన్) సామ యాదిరెడ్డి గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ఈ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ హాజరవుతున్నట్లు చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మనది తరగని వారసత్వ సంపద

సైదాబాద్, ఫిబ్రవరి 4: భారతావని దేవభూమి, వేదభూమి అని, పురాణాలు మన జీవితానికి ఆధారాలని శ్రీ సత్యసాహితీ విశ్వ విద్యాలయము ప్రశాంతి నిలయం ఫిజిక్స్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ బి.కోమలాంబ అన్నారు. కరుణశ్రీ సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు మన వారసత్వ పరంపర ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆనందం, సహనం, వినయం, సచ్చిలత, ధర్మ మార్గము, ఓపిక, సంకల్ప బలం, ప్రేమ, ఆచారాలు, ఆత్మీయత, ఐక్యత, ధైర్యం, నైపుణ్యం విషయాలను కథలు, పాటలు, పద్యాల ద్వారా వివరించారు. సంస్థ అధ్యక్షులు చిన్మయానంద ఆధ్యాత్మిక పీఠం డైరెక్టర్ ఆచార్య కడారి సత్యమూర్తి మాట్లాడుతూ.. భగవద్గీత ప్రాముఖ్యతను వివరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బి.కోమలాంబ

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల

మలక్‌పేట, ఫిబ్రవరి 4: స్వయం సహాయక గ్రూపుల మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగపరుచుకొని ఆర్థిక స్వావలంభన సాధించాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల సూచించారు. ఆదివారం పాత మలక్‌పేట డివిజన్‌లోని స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకొని, పలు సూచనలు చేశారు. పాత మలక్‌పేట డివిజన్‌లోని మహిళలు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడితే.. వారికి నిధులు ఇప్పించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. బ్యాంకుల ద్వారా ఎస్‌హెచ్‌జీ సభ్యులు రుణాలు పొందడం, సకాలంలో తిరిగి వాటిని చెల్లించడం ద్వారా మరింత ఎక్కువ మొత్తంలో లోన్ పొందవచ్చునని తెలిపారు. అవి మీ కుటుంబాల ఆర్థిక ఎదుగుదలకు ఉపయోగపడతాయన్నారు. చిన్న మొత్తాల్లో రుణాలు పొందే మహిళలు వాటిని వృథా చేయకుండా చిన్న చిన్న వ్యాపారాలు, వృత్తిపరమైన కార్యక్రమాలను నిర్వహించుకోవాలన్నారు. దీంతో ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చునన్నారు. చిన్న మొత్తాల పొదుపులు జీవన పరిస్థితులను మెరుగుపరుచడానికి, పేదరిక నిర్మూలనకు ఎంతో దోహదపడతాయన్నారు. పేదరికం నిర్మూలనలో స్వయం సహాయక సంఘాల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. మలక్‌పేట నియోజకవర్గంలో మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు కుట్టు శిక్షణ వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసి.. సోలార్ యే మిల్లత్ ద్వారా కుట్టు మిషన్లను కూడా పంపిణీ చేస్తామన్నారు. మహిళలకు స్వయం ఉపాధికి సంబంధించి ఎలాంటి సహకారం కావాలన్నా ప్రభుత్వం తరపున తాను ఇప్పించేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన తెలిపారు. మలక్‌పేట నియోజకవర్గంలో అనేక సహాయక సంఘాలు ఉన్నాయని, వారు ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకొని మిగతా మహిళలకు సహాయ, సహకారాలు అందిస్తున్నారన్నారు. వారి సలహాలు, సూచనలు పొందుతూ ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాత మలక్‌పేట డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీ, మహిళలు పాల్గొన్నారు.

టీఎంయూ రాష్ట్ర మహాసభలను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

యూనియన్లు లేకుంటే కార్మిక వ్యవస్థ లేదు

మన్సూరాబాద్, ఫిబ్రవరి 4: కార్మికులకు రావాల్సిన బకాయిల సమస్యపై ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తానని ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. ఎల్బీనగర్, చింతలకుంటలోని హిమగిరిగార్డెన్‌లో ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ) రాష్ట్ర మహాసభను యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ చందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కోదండరాం మాట్లాడుతూ.. యూనియన్లు లేకుంటే కార్మిక వ్యవస్థ లేదన్నారు. కార్మికుల కష్టనష్టాల్లో యూనియన్ల పాత్ర కీలకమన్నారు. ప్రజా రవాణాను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. అనంతరం మహాసభల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అశ్వత్థామరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు శంకర్, రాజలింగం, వీకే రెడ్డి, నిరంజన్, కౌసల్య, శ్రీదేవి, కర్నె భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

మండల స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో విజేతలుగా నిలిచిన భవిష్య స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న అతిథులు

వనస్థలిపురం, ఫిబ్రవరి 4: చిన్నారులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జరిగిన బాలాపూర్ మండల స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో హస్తినాపురానికి చెందిన భవిష్య ఇంటర్ నేషనల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఖోఖో బాలురు, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. వారికి పథకాలను అందించి, అభినందించారు. మరో అతిథి దామోదర్ రావు మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసం పెరుగుతుందని, తద్వారా విద్యలో కూడా చురుకుగా ఉంటారన్నారు. విజేతలను అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ధైర్యంతో జయించొచ్చు

- డాక్టర్ విజయ్‌కరణ్ రెడ్డి

మణికొండ, ఫిబ్రవరి 4: క్యాన్సర్‌ను ధైర్యంతో జయించొచ్చని ఆంకాలజీ నిపుణులు డాక్టర్ విజయ్‌కరణ్ రెడ్డి అన్నారు. మణికొండ పంచవటి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏరెట్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ క్యాన్సర్ డే కావడంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంకాలజిస్ట్ డాక్టర్ విజయ్‌కరణ్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటా 16 లక్షల మంది క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. క్యాన్సర్ గురించి అవగాహన పెంపొందించడానికి, దాని నివారణ, గుర్తింపును, చికిత్సను ప్రోత్సహించేందుకు ఏటా ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవంగా జరుపుతున్నామన్నారు. క్యాన్సర్ వ్యాధి నివారణలో భాగంగా అందరూ కలిసికట్టుగా ధైర్యంగా సమస్యను ఎదుర్కోవాలని తెలియజేశారు. అందులో భాగంగా 60 మంది మహిళల కోసం అత్యాధునిక యంత్ర పరికరాలతో కూడిన మొబైల్ వాహనంలో మెమోగ్రఫీ, సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గైనకాలజిస్ట్ డాక్టర్ శిల్ప మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో వ్యక్తిగత పరిశుభ్రత, 40 ఏండ్లు దాటిన ప్రతి మహిళ నిస్సంకోచంగా ముందుకు వచ్చి క్యాన్సర్ పరీక్షలు స్వచ్ఛందంగా చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన డాక్టర్లకు, సీబీఓ వెంకట్‌ని పంచవటి కాలనీ సంక్షేమం సంఘం తరపున సీతారాం ధూళిపాళ, సాగర్ తదితరులు శాలువాతో సత్కరించారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

కందుకూరు. ఫిబ్రవరి 4 : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చేవేళ్ల మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. దెబ్బడగూడ గ్రామంలో స్వర్గీయ కొండ మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఆయన పాల్గొని ఉచిత మందులను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలను నిర్వహించడం పేదలకు ఆరోగ్య సేవలందించినట్లు అవుతుందని పేర్కొన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పేదలకు వైద్య సేవలందించేందుకు కృషి చేయాలని స్వచ్ఛంద సంస్థలను కోరారు. ప్రభుత్వం ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో పేదలకు వైద్యం అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. సందర్భంగా దెబ్బడగూడతో పాటు పరిసర గ్రామాల ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతి పాండు, నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, కొంతం జంగారెడ్డి, ఎంపీటీసీ ఎల్మటి లక్ష్మీ, బీజేవైఎం నాయకులు కల్లెం సుదాకర్‌రెడ్డి, సురుసాని భూమిరెడ్డి, ఎల్మటి అశోక్‌రెడ్డి, చెన్నారెడ్డి, కళ్యాణ్, మల్లారెడ్డి, బండ రామాంజి, బాబూరావు, శ్రీశైలం, సందీప్‌రెడ్డి, డాక్టరు అనుద్రుతి, సంతోష్, వైద్య సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజలకు మందులు పంపిణీ చేస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

అమృత ఎవెన్యూ నూతన కమిటీ

బండ్లగూడ, ఫిబ్రవరి 4: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అమృత ఎవెన్యూ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఏ.రవి కుమార్, ఉపాధ్యక్షులుగా ప్రదీప్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా నరసింహ బాబు, కోశాధికారిగా భాస్కర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా పాపయ్య యాదవ్, విజయ్, విమల్, జగదీష్, శ్రీదేవి, తేజ వికాస్, అనితా చౌదరి, లలిత, రాజు గౌడ్, సలహాదారులుగా జయకుమార్, శంకర్, ఆంజనేయులును ఎన్నుకున్నారు. కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

అన్నదానం చేయడంలో ఎంతో ఆనందం

ఆర్కేపురం, ఫిబ్రవరి 4 : పేదల ఆకలి తీర్చేందుకు రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో భాగంగా ఆదివారం గాంధీ జనరల్ ఆస్పత్రి వద్ద అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ పెద్ది శంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద రోగులకు సహాయకులుగా వచ్చే వారికి అన్నదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ మర్యాల, విజయభాస్కర్, ప్రకాశ్ యాదవ్, శివ, చైతన్య, శివ, నాయుడు, నితిన్, విష్ణువర్ధన్, నరేంద్రవర్మ తదితరులు ఉన్నారు.

గాంధీ ఆస్పత్రి వద్ద అన్నం వడ్డిస్తున్న పెద్ది శంకర్

క్రీడల్లో ఆసక్తి చూపాలి

కందుకూరు. ఫిబ్రవరి 4 : క్రీడలు స్నేహానికి నాంది పలుకుతాయని మాజీ సర్పంచ్ కాకి ఇందిరమ్మ తెలిపారు. అన్నోజిగూడ గ్రామంలో యువకులు నిర్వహించిన ప్రిమియర్ లీగ్ సీజన్ 5 క్రికెట్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆదివారం బహుమతులను అందజేశారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి దశరథ ముదిరాజ్‌తో కలిసి మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని కోరారు. ఆటల పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా క్రీడలకు పెద్దపీట వేసినట్లు పేర్కొన్నారు. ఆర్‌సీబీ జట్టు విజయం సాధించగా.. ఎంఐ టీమ్‌కు రెండో బహుమతి కింద ట్రోఫీ.. నగదును ఢిల్లీ కృష్ణ అందజేశారు. అనంతరం క్రీడాకారులు, యువకులు కలిసి గ్రామ సర్పంచ్‌గా సేవలందించిన ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల యువజన విభాగం కార్యదర్శి గొర్రెంకల రామకృష్ణ ముదిరాజ్, దాతలు సుధాకర్, రఘురాం రాథోడ్, ఆర్గనైజర్లు ఢిల్లీ శివకుమార్, శ్రీకాంత్, శివకృష్ణ, భాను, క్రీడాకారులు యువకులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న ఇందిరమ్మ దశరథ ముదిరాజ్

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి

కందుకూరు, ఫిబ్రవరి 4 : యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని మండల అధ్యక్షుడు పసుపుల పర్వతాల్ యాదవ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సీతారామ శాస్త్రీ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. యాదవులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా రాణించాలన్నారు. యాదవులకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని కోరారు. యాదవుల సత్తాను చూపాలని, ఇందుకోసం కృషి చేయాలని కోరారు. యాదవులు బలోపేతం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలరాజు, మైసయ్య యాదవ్, నర్ల నర్సింహ యాదవ్, రామకృష్ణ యాదవ్, చెన్నయ్య యాదవ్, అంజయ్య యాదవ్, సుధాకర్ యాదవ్, రాజు యాదవ్, శ్రీను యాదవ్, విశ్వనాథ యాదవ్, ఆంజనేయులు యాదవ్, రాజశేఖర్ యాదవ్, భిక్షపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో మాట్లాడుతున్న పర్వతాల్ యాదవ్

కార్యకర్తలకు అండగా ఉంటాం..

ఉప్పల్, ఫిబ్రవరి 4: కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం ఉప్పల్ మల్లాపూర్ వీఎన్ఆర్‌గార్డెన్‌లో ఉప్పల్ నియోజకవర్గ విజయోత్సవసభ, సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి మాట్లాడుతూ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని, విద్య, వైద్యం కోసం ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యేగా నా వేతనం ప్రజల కోసమే ఖర్చు చేస్తామన్నారు. నా ట్రస్టు ద్వారా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో భద్రారెడ్డి, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు శాంతిసాయిజెన్ శేఖర్, దేవేందర్‌రెడ్డి, శ్రీదేవి, గీతాప్రవీణ్, ప్రభుదాస్, శిరీషారెడ్డి, మాజీ కార్పొరేటర్లు శ్రీనివాస్‌రెడ్డి, పావనీరెడ్డి, అంజయ్య, హన్మంతరెడ్డి, జ్యోత్స్నా నాగేశ్వర్‌రావు, డివిజన్ అధ్యక్షులు డా.బీవీ.చారి, మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణతల్లి విగ్రహం..

ప్రొఫెసర్ జయశంకర్ సేవాసమితి ఆధ్వర్యంలో మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ ప్రాంతంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి ఆవిష్కరించారు.

సాయిజెన్ శేఖర్‌కు శుభాకాంక్షలు

బీఆర్ఎస్‌పార్టీ గ్రేటర్ సీనియర్ నాయకులు సాయిజెన్ శేఖర్ జన్మదినం సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. నాచారంలోని వీఎన్ఆర్ గార్డెన్‌లో కేటీఆర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శాలువాతో సత్కరించారు. కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ పాల్గొన్నారు.

విజయోత్సవ సభకు త్రేణులు..

చర్లపల్లి: మల్లాపూర్ డివిజన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గ విజయోత్సవ సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ శ్రీదేవి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.